క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీలో చేరిక



వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చీటూరి అశోక్ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి చీటూరి అశోక్, అతని సోదరుడు రాజుకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం చీటూరి అశోక్ మాట్లాడుతూ.. బీజేపీ మతతత్వ పార్టీ వల్ల దేశంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగే అవకాశం లేకుండా పోయిందని అభిప్రాయపడ్డారు. దేశ ప్రజలందరూ కాంగ్రెస్ వైపు చూస్తున్నార న్నారు. లోకసభ ఎన్నికల్లో వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోసం తన వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వర్ధన్నపేట పట్టణ అధ్యక్షుడు మైస నరేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

చెన్నారావుపేట : చెన్నారావుపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి బొర్ర రాజేందర్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శిగా కాసర్ల సురేష్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ కలెక్టర్ ప్రావీణ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. చెన్నారావుపేట గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న రాజేందర్ గ్రామపంచాయతీలో ఇంటి నిర్మాణానికి ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో అనుమతి ఇచ్చినందుకు చెన్నారావుపేట గ్రామానికి చెందిన జున్నుతుల మహేందర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారి కల్పన, నర్సంపేట ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ వేదవతితో పూర్తిస్థాయిలో విచారణ చేయించి వారి నివేదికల ఆధారంగా రాజేందర్‌ను సస్పెన్షన్ చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. అమీనాబాద్ గ్రామ గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న కాసర్ల సురేష్‌ను చెన్నారావుపేట గ్రామ ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

జనగామ రూరల్ : పట్టాలు దాటుతుండగా ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని రైలు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యకి మృతి చెందిన ఘటన శుక్రవారం జనగామ రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. ప్రకారం...వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం దౌలత్‌నగర్‌కు చెందిన దుడ్డు రాజు (27) కొమురవెల్లి దేవస్థానంకు వెళ్లివస్తుండగా జనగామ రైల్వేట్రాక్ దాటుతుండగా గుర్తుతెలియని ట్రెస్ ఢీకొట్టడంతో మృతి చెందాడు. వెంటనే మృతుడిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృత దేహాన్ని పోస్టుమార్టం చేసి అప్పగించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

పెద్దవంగర : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన ఎడవెల్లి అశోక్‌రెడ్డి(45) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం తన ద్విచక్రవాహనంపై తొర్రూరు డివిజన్ కేద్రానికి వ్యక్తిగత పనుల నిమిత్తం వెళ్తున్న క్రమంలో సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం జలాల్‌పురం గ్రామానికి చెందిన బారాజు వెంకన్న తన గ్రామానికి తొర్రూరు నుంచి ద్విచక్రవాహనం వస్తున్న క్రమంలో పెద్దవంగర పోలీస్‌స్టేషన్ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనగా అశోక్‌రెడ్డికి తీవ్ర గాయలైన విషయం తెలిసిందే. కాగా మెరుగైన వైద్యం కోసం అతన్ని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య సరిత, కొడుకు విఘ్నేశ్వర్ రెడ్డి, కూతురు సౌమ్య పిల్లలు ఉన్నారు.

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

ఖిలా వరంగల్: గుర్తు తెలియని యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వరంగల్ మధ్యకోటలోని ఉత్తర ద్వారం సమీపంలో రాతి కోటలో శుక్రవారం సాయంత్రం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం మధ్యకోట రాతికోట మెట్ల మార్గంలోని చెట్ల నీడన ఓ గుర్తు తెలియని 25 ఏళ్ల మధ్య వయస్సు గల యువకుడు క్రిమిసంహార మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎస్సై గోవర్ధన్ విచారణ చేపట్టారు. వివరాలకు 87125 94939 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఐలోని మల్లన్నకు ఎన్నికల వ్యయ పరిశీలకుడి పూజలు

ఐనవోలు : ప్రఖ్యాత ఐనవోలు శ్రీమల్లికార్జున స్వామి, కొండపర్తిలోని త్రికూట ఆలయాలను వరంగల్ పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలన అధికారి ఏ దిలీబన్ సందర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు వేదాశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు. తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఆర్ఐ మల్లయ్య ఉన్నారు.

బాబోయ్.. ఆర్‌యూబీ

వేసవిలోనూ చేరుతున్న నీరు

- రాత్రి వేళల్లో లైట్లు లేక చిమ్మచీకట్లు
- ఇకనైనా బావి నిర్మాణం చేపట్టేనా?

సంగెం : 'బాబోయ్.. ఆర్‌యూబీ' అంటూ జనం బెంబేలెత్తుతున్నారు. వేసవిలోనూ ఆర్‌యూబీలో నీరు చేరుతోంది. అధికారులు లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళల్లో కారు చీకట్లు కమ్ముకుంటుండడంతో ప్రయాణికులు తారెత్తుతున్నారు. ఎల్గూర్ రంగంపేట లెవల్ క్రాసింగ్ రైల్వే గేట్ వద్ద పనులు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో నెలకొన్న దుస్థితిపై 'సాక్షి' కథనం..

వరంగల్–విజయవాడ రైల్వే మార్గంలో థర్డ్ లైన్ పూర్తి కావడంతో రైళ్ల రాకపోకలకు లెవల్ క్రాసింగ్ గేట్లు అడ్డంకిగా ఉండకుండా రైల్వే శాఖ లెవల్ క్రాసింగ్ గేట్లను తొలగించేందుకు ఆర్‌యూబీలను నిర్మించింది. ఈ క్రమంలోనే మండలంలోని ఎల్గూర్ రంగంపేట సమీపంలోని 68/ఇ రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్‌ను తొలగిస్తూ గత మార్చి 22న ఐఓడబ్ల్యూ శ్రీనివాస్ ప్రకటించారు. థర్డ్ లైన్ నిర్మాణం తర్వాత లెవల్ క్రాసింగ్ వద్ద ప్రయాణికులు ఎక్కువ సమయం వేచి ఉంటున్న క్రమంలో అక్కడ రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మించినట్టు ఆయన పేర్కొన్నారు. అండర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో లెవల్ క్రాసింగ్ గేట్‌ను తొలగించామని స్పష్టం చేశారు. సిగ్నల్ రూంను పూర్తిగా తొలగించి దాని స్థానంలో అండర్ బ్రిడ్జిలో నీరు చేరకుండా బావి నిర్మాణం చేపడతామని చెప్పారు. బావి నుంచి సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల మేరకు డ్రెయిన్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఆ సమయంలో ఆర్‌యూబీ నిర్మాణం పూర్తి కాకుండానే గేట్‌ను మూసివేయవద్దని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు అడ్డుకోగా త్వరలోనే బావి నిర్మించి ఊటనీరు అందులోకి చేరితే డ్రెయిన్ (కాలువ) ద్వారా దూరంగా పంపిస్తామని హామీ ఇచ్చి గేట్ మూసి వేయించారు. నెలరోజులు గడిచింది. అయినా బావి నిర్మించలేదు. ఈ క్రమంలో కొద్ది రోజులుగా వేసవిలోనూ ఊట నీరు రోజురోజుకు భారీగా చేరుతోంది. ఇక వానాకాలం వస్తే అండర్ బ్రిడ్జి నుంచి ప్రయాణించడానికి వీలుకాదన్నది జగమెరిగిన సత్యం. సుమారు 10 నుంచి 12 ఫీట్ల మేర నీరు చేరుతుందని ప్రజలు ఆందోళనకు గురౌతున్నారు. ఊటనీరు, వాననీరు వెళ్లే మార్గం త్వరగా నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇక అండర్ బ్రిడ్జిలో లైట్లు ఏర్పాటు చేయని నిర్లక్ష్యం కనపడుతోంది. ఈ క్రమంలో సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు తీవ్ర చీకటి నెలకొంటోంది. కాలినడకన వెళ్లే ప్రయాణికులు భయంతో వణికిపోతున్నారు. ఇకనైనా వెంటనే ఆర్‌యూబీలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



ఆర్‌యూబీలో నిలిచిన నీరు



తొలగించాల్సిన సిగ్నలింగ్ రూం

ఊటనీరు నిల్వకుండా చూడాలి



ఆర్‌యూబీ నిర్మాణం ఇంకా పూర్తి చేయలేదు. ప్రస్తుత వేసవిలోనూ ఊటనీరు రెండు ఫీట్లకు పైగా చేరుతోంది. వానాకాలం వస్తే వాననీరు, ఊటనీరు కలిసి ప్రయాణికులు రాకపోకలు సాగించే పరిస్థితి ఉండదు. అధికారులు స్పందించాలి. బావి నిర్మించి ఊటనీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేయాలి.

-జనగాం రమేశ్ గౌడ్, మాజీ సర్పంచ్, ఎల్గూర్ రంగంపేట

రాత్రిపూట చిమ్మచీకట్లు



అండర్ బ్రిడ్జిలో సాయంత్రం నుంచి తెల్లవారే వరకు చిమ్మ చీకటి ఉంటోంది. ఇక రాత్రి వేళల్లో అందులోంచి నడిచి వెళ్లాలంటే భయంగా ఉంటోంది. విష పురుగుల కాటుకు గురయ్యే ప్రమాదం ఉంది. బ్రిడ్జి కింద ఇరువైపులా విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. తద్వారా ప్రయాణికులకు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

-గద్దం వినోద, ఎల్గూర్ రంగంపేట

త్వరలో పనులు చేపడతాం

లెవల్ క్రాసింగ్ గేట్ తొలగించాక సిగ్నలింగ్ పూర్తిగా తొలగించడానికి రైల్వే బోర్డు ఉన్నతాధికారుల అనుమతి లభించింది. ఇన్నాళ్లుగా ఉన్న లెవల్ క్రాసింగ్ సిగ్నళ్లు డిస్కనెక్ట్ అయ్యాయి. సిగ్నల్ రూంను తొలిగించి దాని స్థానంలో ఊటనీరు, వాననీరు వేళ్లేలా ఆర్‌యూబీ పక్కనే ఓపెన్ వెల్ నిర్మిస్తాం. వానాకాలం వచ్చే లోగానే ఆర్‌యూబీలో బావి నిర్మించి నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటాం.

-శ్రీనివాస్, ఐఓడబ్ల్యూ ఎస్ఎస్ఈ వర్క్స్ ఇన్‌స్పెక్టర్

సీతారాంనాయక్ గెలుపునకు కృషి చేయండి



ప్రచారం చేస్తున్న రాంబాబు, నాయకులు

నర్సంపేట : మహబూబాబాద్ ఎంపీగా బీజేపీ తరపున బరిలో నిలిచిన అజ్మీర సీతారాంనాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు కోరారు. ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడారు. బీజేపీ మళ్లీ కేంద్రంలో అధికారంలోకి వస్తే గ్రామ స్థాయి నుంచి దేశం అన్ని రంగాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందని చెప్పారు. సీతారాంనాయక్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరు సందీప్, కొంపెల్లి రాజు, బూత్ అధ్యక్షుడు బూరుగు సాయిరాజ్, సామల ప్రవీణ్‌కుమార్, బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి భవానిశంకర్, నాయకులు బూరుగు చరణ్, మాసు స్వామి, పోలు సత్యం, బోలుగొడ్డు అనిల్, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ స్టేట్ ర్యాంకర్‌కు సన్మానం



కీర్తిని సన్మానిస్తున్న నాయకులు

గీసుకొండ : ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చాటి స్టేట్ సెకండ్ ర్యాంకర్‌గా నిలిచిన మండలంలోని కీర్తినగర్‌కు చెందిన నమిలికొండ కీర్తిని బీఆర్ఎస్ నాయకులు సుంకరి శివ, మెండు కమలాకర్, వెంకటేశ్వర్లు, కొండ వేణు, రవికుమార్, సోమేశ్వర్ శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం శివ మాట్లాడారు. ఇంటర్ ఎంపీసీ ఫస్ట్ ఇయర్ పరీక్షల్లో కీర్తి 470కి 467 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలవడం అభినందనీయమని తెలిపారు. కీర్తి భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కీర్తి తండ్రి నమిలికొండ కిరణ్‌కుమార్, నాయకులు సతీశ్, గీతారాణి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం కుట్టడంలో జాగ్రత్తలు పాటించాలి



కొలతలు తీయిస్తున్న రేణుకాదేవి

దుగ్గొండి : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ యునిఫాం కుట్టడంలో జాగ్రత్తలు పాటించాలని అదనపు డీఆర్‌డీఓ రేణుకాదేవి సూచించారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో కుట్టు శిక్షణపై ఏర్పాటు చేసిన మూడ్రోజుల అవగాహన సదస్సు శుక్రవారం ప్రారంభం అయ్యింది. ఈ సందర్భంగా రేణుకాదేవి విద్యార్థులకు కొలతలు తీయించి మాట్లాడారు. చిన్నారులకు సరిపడేలా కొలతలు తీసి కుట్టాలని చెప్పారు. సకాలంలో యూనిఫారాలు కుట్టడాన్ని పూర్తి చేసి పాఠశాలలకు అందించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు అప్పగించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు లలిత, సుమలత, రజిత, ఏపీఎం రాజ్‌కుమార్, శిక్షకులు కవిత, అనిత, స్వరూప పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి భూమి పూజ



వెంకటాపూర్‌లో పూజ చేస్తున్న నాయకులు

ఐనవోలు : మండలంలోని వెంకటాపూర్, ఒంటిమామిడిపల్లి గ్రామాల్లో రామాలయ నిర్మాణానికి గ్రామస్తులు శుక్రవారం భూమి పూజలు చేశారు. వెంకటాపూర్ గ్రామంలో 1994 నుంచి రామాలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం సీతారాముల కల్యాణం నిర్వహిస్తుండగా.. 150 మంది సభ్యుల కమిటీ ఆధ్వర్యంలో గతంలోనే ఆలయ నిర్మాణానికి స్థలం కొనుగోలు చేశారు. కాగా ఇటీవల నిర్మాణ కమిటీకి అధ్యక్షుడిగా దామెరగిద్ద నేతాజీని నియమించి రామాలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అదే విధంగా ఒంటిమామిడిపల్లిలో రెండేళ్లుగా శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఈ ఏడాది దాతల సహకారంతో సీతారాముల విగ్రహాలను పంచలోహాలతో చేయించారు. కాగా రెండు రోజుల క్రితం గ్రామస్తులు సమావేశమై గ్రామంలోని బోడగుట్టపై రామాలయ నిర్మాణం చేపట్టడానికి సుముఖత చూపారు. దీంతో రామాలయ నిర్మాణానికి గ్రామస్తులు భూమి పూజ చేశారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఆత్మకూరు : మండలంలోని ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని ఎంపీపీ మార్క సుమలత కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిరర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించి మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. నీరుకుళ్ల ఎంపీటీసీ అర్షం వరుణ్‌గాంధీ మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ సమస్య నెలకొందని చెప్పారు. సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని, పంచాయతీ కార్యదర్శులు ఉదయం గ్రామాలకు వెళ్లి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక రాజు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. సమావేశంలో డీఈలు చంద్రభాను, భానుకుమార్, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు చించిన వారిపై కేసు నమోదు

సంగెం : పార్లమెంట్ ఎన్నికల ప్రచార రథంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫ్లెక్సీలను చింపిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు. ఖిలావరంగల్ మండలంలోని వసంతాపూర్ గ్రామానికి చెందిన గుండెకారి జైపాల్ మహేంద్ర బోలేరో వాహనంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం కోసం ఈనెల 23 నుంచి మే 8వ తేదీ వరకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడితో ఒప్పందం చేసుకుని ప్రచారం చేస్తున్నారు. కాగా శుక్రవారం నాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా వెంకటాపూర్ నుంచి ప్రచారం నిర్వహిస్తూ మధ్యాహ్నం ఎల్గూర్ స్టేషన్ పరిధిలోని చిలుకమ్మతండాలో భోజనం చేయడానికి వెళ్లే సమయంలో వాహనాన్ని మాజీ సర్పంచ్ ఇంటి ఎదుట ఉంచాడు. ఈ క్రమంలో అక్కడకు వచ్చిన గుగులోత్ శంకర్, బానోత్ రాజు బోలేరో వాహనంలో ఉన్న ఫ్లెక్సీలు చించుతుండగా జైపాల్ అడ్డుకునేందుకు యత్నించాడు. అయినా శంకర్, రాజు వాహనం ఎందుకు పెట్టావంటూ ఫ్లెక్సీలను చించేశారు. జైపాల్ ఫిర్యాదు మేరకు శంకర్, రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

మొక్కజొన్న పంటను కాల్చిన వ్యక్తులపై..

దామెర : మొక్కజొన్న పంటను కల్చిన వ్యక్తులపై కేసు నమోదు అయ్యింది. ఈ సంఘటన మండలంలోని పులుకుర్తిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెంచాల దేవేందర్‌కు గ్రామంలో 12 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో తనకు వాటా ఉందని దేవేందర్ తమ్ముడు చక్రపాణి గొడవపడ్డాడు. గతంలోనే భూమి పంపకాలు జరిగాయని, తన భూమిలో వాటా రాదని దేవేందర్ తేల్చిచెప్పాడు. దీంతో చక్రపాణితో పాటు ఇద్దరు అన్నలపై కక్షపెంచుకున్న చక్రపాణి.. గ్రామానికి చెందిన గోవిందు సుధాకర్, గడ్డం సాంబయ్య, జిల్లెల వెంకటస్వామి సాయంతో దేవేందర్‌కు చెందిన 3 ఎరకాల మొక్కజొన్న చేనుకు నిప్పుపెట్టినట్లు తెలిపారు. దేవేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలింగ్ కేంద్రంలో సీఐ తనిఖీ



గంగారం: మండలంలోని దుబ్బగూడెంలో పోలింగ్ స్టేషన్‌ను గూడూరు సీఐ బాబురావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో ప్రజలతో సీఐ మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలి

ఖిలా వరంగల్ : వరంగల్ నగర పరిసరాల్లో లారీల పార్కింగ్ కోసం రెండెకరాల భూమిని కేటాయించి లారీ ఓనర్ల సంక్షేమానికి కృషి చేయాలని ఎండీ.ఫిరోజ్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని మంత్రి చాంబర్‌లో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఫిరోజ్ మాట్లాడుతూ లారీ ఓనర్లు నిరంతరం ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పార్కింగ్ స్థలం లేక ప్రైవేట్ స్థలాల్లో పార్కింగ్‌కు రూ.వేలాదిగా అద్దె చెల్లించలేక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే 200 ఫీట్ల రింగ్ రోడ్డు కింద ఇళ్ల స్థలాలు, భూములు కోల్పోతున్న బాధితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, లారీ ఓనర్ల సంక్షేమానికి ప్రణాళికతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో సుల్తానా అలీ, ముజాహిద్, గౌస్‌పాషా, సమీర్, అర్షత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యతో వికాసం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ మంజుల



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రాధ

చెన్నారావుపేట : అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశ పెట్టిన పూర్వ ప్రాథమిక విద్యతో చిన్నారుల్లో శారీరక, మానసిక వికాసం కలుగుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల తెలిపారు. మండలంలోని కందిగడ్డతండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు వయస్సున్న బాలలకు శారీరక, సాంఘిక, మానసిక బాష, భావోద్వేగాల అభివృద్ధి లక్ష్యంగా ప్రీ ప్రైమరీ స్కూల్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చిన్నారుల విద్యాభ్యాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు పునాది వేస్తాయన్నారు. నాలుగు నెలలకోసారి చిన్నారుల సామర్థ్యాలను అంచనా వేసి వారిలో ఉన్న లోపాలను ప్రాథమిక దశలోనే గుర్తించి నివారణకు చర్యలు చేపడతామని చెప్పారు. మూడేళ్ల వయస్సు నిండిన వెంటనే చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న పూర్వ ప్రాథమిక విద్యకు పంపించాలని తల్లులను కోరారు.

చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో నాణ్యమైన విద్యాబోధన, పౌష్టికాహారం అందిస్తున్నట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ తెలిపారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాల్లో విద్యాబోధన లభిస్తుందని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లభిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు దేవమ్మ, లక్ష్మీబాయి, శౌరీలు, విజయ, సరోజన, మంజుల, సునీత, ఆయాలు సరిత, కొమురమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా కడియం కావ్యను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్

పర్వతగిరి : వరంగల్ ఎంపీగా కడియం కావ్యను గెలిపించాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యోడుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లూరి దిలీప్ గౌడ్ కోరారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ కులమతాల నడుమ చిచ్చు పెట్టి ఓట్లు దండుకునే కుట్ర చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసిందని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీని విస్మరించిందని, నిత్యావసర సరుకుల ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తోందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒకటేనని చెప్పారు. ఎంపీగా కావ్యను గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు ఆవుల పవన్, నరేశ్, మండల అధ్యక్షుడు నీరటి ప్రశాంత్, నాయకులు దేవ, పిట్టల లోకేశ్, రాము, గణేశ్, పృథ్వీ, వినయ్ పాల్గొన్నారు.

గంగమ్మ, పెద్దమ్మతల్లి ఆలయాలు ప్రారంభం



పూజ చేస్తున్న భక్తులు

నెక్కొండ : మండలంలోని వెంకటాపురంలో ఇటీవల నిర్మించిన గంగమ్మ, పెద్దమ్మతల్లి ఆలయాలను యాదవ, ముదిరాజ్ కుల సంఘాల నాయకులు శుక్రవారం ప్రారంభించారు. రెండ్రోజులుగా ఆ ఆలయాల్లో పూజలు జరుగుతున్నాయి. ఆయా కులాల ప్రజలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. భక్తులు తలపై బోనాలతో ఆలయాలకు తరలిరావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా యాదవ సంఘం పెద్ద గొల్ల మూటిక ఐలయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బోయిన యాకాంబ్రం మీడియాతో మాట్లాడారు. యాదవ కులస్తులు గంగమ్మకు, ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మతల్లికి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. ఆయా కులాల ప్రజలు ఐక్యతతో ఆలయాలను నిర్మించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జి.కుమార్, యాదవ సంఘం సభ్యులు రాజన్న, ఐలయ్య, రమేశ్, రాజు, ముదిరాజ్ సంఘం సభ్యులు మధు, నారాయణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరన్న విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు చేస్తున్న కురుమ కులస్తులు, పూజారులు

దుగ్గొండి : మండలంలోని తొగర్రాయి గ్రామంలో బీరన్న విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద మంత్రోచ్చారణల నడుమ ఆలయంలో అక్క మంకలి బీరయ్య, కామరాతి విగ్రహాలను ప్రతిష్ఠించారు. సాయంత్రం దేవతామూర్తులకు పాలు, నెయ్యి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కురుమ కులస్తులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని బీరన్నను మొక్కుకున్నారు. పలువురు మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కురుమ కుల పెద్దలు అన్న లక్ష్మణ్, అన్న రాజు, తొర్రి పెద్ద కట్టయ్య, కురుమ సంఘం కమిటీ అధ్యక్షుడు రాస చేరాలు, జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమల భద్రయ్య, మాజీ సర్పంచ్ ఓడేటి తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'అబద్ధపు హామీలను నమ్మొద్దు'

దామెర : కాంగ్రెస్, బీజేపీ ఇస్తున్న అబద్ధపు హామీలను నమ్మి ప్రజలు మోసపోవద్దని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు కోగిల్వాయి, పులుకుర్తి, పసరగొండ, ల్యాదెళ్ల, సింగరాజుపల్లి, వెంకటాపూర్, దమ్మన్నపేట్, దుర్గంపేట్, సీతారాంపూర్, ఒగ్లాపూర్, తక్కళ్ల పహాడ్, ముస్త్యాలపల్లి గ్రామాల్లో శుక్రవారం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ బూటకపు హామీలను ఇస్తూ ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలులో విఫలమయ్యిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, ప్రధానకార్యదర్శి ముదిగొండ కృష్ణమూర్తి, ఎంపీపీ కాగితాల శంకర్, వైస్ ఎంపీపీ ఎండీ. జాకిర్‌అలీ, సీనియర్ నాయకులు పోలం కృపాకర్ రెడ్డి, దాడి మల్లయ్య, కేతిపల్లి శ్రీధర్‌రెడ్డి, గట్ల విష్ణువర్ధన్‌రెడ్డి, పున్నం సంపత్, సత్యనారాయణ రెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.